క్లుప్తంగా

విత్తన పండుగకు హాజరైన రైతులు



అయిజ: అనమాస్‌పల్లి కడ్తాల్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విత్తన పండుగ కార్యక్రమానికి నేల తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి పలువురు రైతులు శనివారం హాజరయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిన్ని కృష్ణ, సునీల్, గణపతిరెడ్డి, ఆంజనేయులు, గోకారి, రాజేందర్‌రెడ్డి, రంగస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్, రాజేష్, రామకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు శ్రీరామనవమి వేడుకలు



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం చూసేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపారు. అనంతరం వడపప్పు, పానకం వితరణ చేశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల గ్రామంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల శాంతినగర్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. 50 మంది విద్యార్థులు క్రీడా ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాఘవేంద్ర, ఏడుకొండలు, ప్రదీప్‌కుమార్, మహేష్, హర్షకుమార్, రాజు, మానస, సుశీల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడు



ఎర్రవల్లి: మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడని విశ్వ హిందూ పరిషత్, ధర్మ ప్రచార సమితి సభ్యులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో శ్రీరాముడి చరిత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నాయకులు సత్యం, నర్సింహులు హాజరై శ్రీరాముని చరిత్ర, గుణగణాలు, నైతిక విలువల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

గద్వాల క్రైం: మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా పార్వతీపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, పార్వతి గత కొంత కాలంగా ఉపాధి కోసం గద్వాలలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పార్వతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమె భర్త చుట్టు పక్కల వాకబు చేయగా ఆచూకీ తెలియకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్వతి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గద్వాల క్రైం: గుట్టు చప్పుడు కాకుండా నడుపుతున్న పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. శనివారం సాయంత్రం మేళ్లచేరువు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.8010 నగదు, పేక ముక్కలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్

సాక్షి నెట్‌వర్క్: ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని పలు పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘ నాయకులు అన్నారు. శనివారం జగ్జీవన్‌రాం 118వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, పలు కార్యాలయాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కేంద్రమంత్రిగా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన గొప్ప సమరయోధుడని కొనియాడారు.

◆ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గద్వాల జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ చౌరస్తా వద్ద మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా బీజేపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, శంకర్, మధుసూదన్‌బాబు, నల్లారెడ్డి, నారాయణరెడ్డి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇటిక్యాల మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సంపత్, జాన్, యెబ్, యేసు, దాసన్న, ఈరన్న, ఉసేన్, చిన్నరాముడు, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

◆ బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి చేద్దామని జూనియర్ అసిస్టెంట్ భీమయ్య అన్నారు. కేటీదొడ్డిలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మనోహర్, వెంకటేష్ నాయుడు, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ మల్దకల్ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ అశోక్, ఆర్ఐలు కరీం, మద్దిలేటి, బస్టాండు చౌరస్తాలో అంబేడ్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మండల నాయకులు గోవిందు, ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘ నాయకులు రాజశేఖర్, అమృత్‌రాజ్, ప్రవీణ్, వెంకటన్న, కర్రెప్ప, ఏసేపు, బాలన్న, చిన్నయ్య, నర్సింహులు, సుందర్‌రాజ్, సుబ్బారావు, భాస్కర్, చిన్న తిమ్మన్న, యాకోబు, జయానందం పాల్గొన్నారు.

◆ ధరూరు మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిన్నపాడు ఆంజనేయులు, సామాజిక కార్యకర్త శ్రీనివాస్ మహారాజ్, నాయకులు రామన్న, సత్యన్న, మాసన్న, సంజీవ్, శ్రీనివాసులు, రాము, ఎర్రన్న, దేవదాసు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉండవెల్లి మండల కేంద్రం, అలంపూర్ చౌరస్తా, మండలంలోని పలు గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాగరాజు, రమేష్, వెంకటేష్‌గౌడ్, నాగేష్, మద్దిలేటి, మక్తర్‌బాషా, పాండు తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

◆ జగ్జీవన్ రామ్ అందరికీ ఆదర్శప్రాయుడని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. రాజోళి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, ఎమ్మార్పీస్ నాయకులు భాస్కర్, సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, నర్సింహులు, శీలన్న, రవి పాల్గొన్నారు.

◆ అయిజ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో అఖిలపక్ష కమిటీ నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరులో గ్రామ యువత జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరవింద్, కళ్యాణ్, డేవిడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

◆ గట్టు మండల పరిధిలోని మాచర్ల తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ వద్ద జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రంగనాథ్, రామన్‌గౌడ్, చెన్నయ్య, నర్సింహులు, భాస్కర్, ముక్కెరయ్య, బుడ్డన్న, నాగేష్, పంపన్న తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, నాయకులు



అలంపూర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మల్దకల్ తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



కొండేరులో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

సింహ భాగం కేంద్ర ప్రభుత్వానిదే

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పంపిణీలో సింహభాగం కేంద్ర ప్రభుత్వానిదేనని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బింగుదొడ్డి గ్రామంలోని రేషన్ షాపులో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరోనా సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ చేస్తుందని, కేజీ బియ్యానికి కేంద్ర ప్రభుత్వం రూ.40 చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10 మాత్రమే ఇస్తుందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మన్న, దొడ్డెన్నగౌడ్, నారాయణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి

సింగిల్ విండో అభివృద్ధిపై ఆరా



అయిజ: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి కార్యదర్శి శివ శనివారం అయిజ పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అయిజ సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో మాట్లాడారు. తక్కువ కాలంలో వేగంగా అభివృద్ధి చెందడంపై ఆరా తీశారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ విక్రయాలతో పాటు సూపర్ మార్కెట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్, గోకులపాడు, శ్రీనగర్ గ్రామాల్లో శనివారం ఎస్ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

గట్టు: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రాయాపురం గ్రామంలో శనివారం రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడికి 6 కేజీల రేషన్‌బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంతురెడ్డి, బజారి, నాగయ్య, రాముడు, మాజీ ఎంపీటీసీ రంగస్వామి, మాజీ ఉప సర్పంచ్ జనార్ధన్, అంబన్న, వెంకటేష్, సిద్ధు, పాగుంటప్ప, తిమ్మప్ప, రాముడు, నర్సింహులు, వీరన్న, మహాదేవుడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



కేటీదొడ్డిలోని సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయం



పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయం

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీరామనవమికి ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంతో పాటు, రేవులపల్లి, మార్లబీడు, నీలహళ్లి, అల్వలపాడు, ఉప్పేరు, మాల్‌దొడ్డి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి, రామాలయాల్లో దేవుడి తలంబ్రాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నీలహళ్లి గ్రామంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు శనివారం నిర్వాహకులు తెలిపారు. మండపాలు, నీడ పందిళ్లను సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కేటీదొడ్డి: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆలయాలు ముస్తాబు చేశారు. ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. అన్నదానానికి ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం సందర్భంగా శనివారం గణపతి పూజ, గోపూజ, యాగశాలలో హోమం, సీతారాముల మూల విరాట్ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. అదే విధంగా సాయంత్రం ఎదుర్కోళ్ల నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దామోదర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయిజ: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని కిష్టాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భజన మండలి సభ్యులు శ్రీరామ నామావలి కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం ప్రారంభమైన భజన కీర్తనలు ఆదివారం ఉదయం వరకు కొనసాగాయి. స్వామి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భజన కీర్తనలు వినేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇటిక్యాల: మండల పరిధిలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు జయసింహా ఒక ప్రకటనలో తెలిపారు.



అయిజలో శ్రీరామ నామావలి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

యజ్ఞయాగాదులతో సకాలంలో వర్షాలు

మల్దకల్: యజ్ఞ యాగాదుల వల్ల సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా పండుతాయని వేదపండితులు రమేషాచారి, శశాంక దాసు, ప్రసన్న అన్నారు. శనివారం మండలంలోని ఎల్కూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, బ్రహ్మాది హోమం, యోగినీ హోమం, వాస్తు మండల హోమం, పాలికా మండల హోమం, నవగ్రహ హోమం, జపా క్షీరతర్పణ హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు ధాన్యాధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు ప్రాణేష్, రాఘవేంద్ర దాసు, నాగేష్, నరేష్, చక్రధర్ రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న వేదపండితులు

25 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు

వనపర్తి: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల వాల్‌పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.10 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో నిత్యం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని, విద్యారంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా అనేక మిలిటెంట్ పోరాటాలను రాష్ట్ర వ్యాప్తంగా నడిపిస్తుందని తెలిపారు. నూతన విద్యా సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు రూపొందిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థులందరిని ఐక్యం చేసి దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నడుపుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ మహాసభలకు మేధావులు, సామాజిక వేత్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదిల్, వెంకట్, సోహెల్, దేవన్ష్, మాసుమ్, గోవింద్ తదితరులు ఉన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

రామా.. కనవేమిరా!

- రామయ్యా.. ఒక్కసారి ఇటు చూడవయ్యా
- శ్రీరామ నవమి వేళ జిల్లా ప్రజల వేడుకోలు



గద్వాలటౌన్: రామా.. శ్రీరఘురామ అంటూ నిత్యం ప్రార్థించే జనులు శుభప్రదమైన ఈ శ్రీరామ నవమి వేళ నిన్ను కోరుకునేది ఒక్కటే.. నీ రాజ్యం మళ్లీ రావాలి.. నీ మార్గం సమాజానికి ఆదర్శం కావాలి.. పాలకులు నీ మాదిరిగా కొత్త ఉషోదయాన్ని తేవాలి.. రామయ్యా.. నాటి నీ ఆదర్శాలకు, నేటి మానవజాతి మనుగడకు అసలు పొంతనే లేకుండా పోతోంది.. విలువైన ప్రాణం గాలిలో దీపమై ఎప్పుడు ఆరిపోతుందో తెలియని రీతిలో వెలుగుతోంది.. రామయ్యా.. ఒక్కసారి జోగుళాంబ గద్వాల జిల్లాలో గందరగోళంగా మారుతున్న సమాజం వైపు చూడయ్యా.. అంటూ వేడుకుంటున్నారు.

ఎదురించే ధైర్యాన్నివ్వు..

స్వామీ ఏటా శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని నిన్ను పూజిస్తున్నాం.. వడపప్పు, పానకాలు నైవేద్యంగా పెట్టి నీ సేవలో తరిస్తున్నాం.. ఏ చిన్న కష్టమొచ్చినా రామా అంటూ నిన్నే స్మరిస్తున్నాం. ఇందుకు ప్రతిఫలంగా మేము కోరేది ఒక్కటే.. చీకటి వెలుగుల్లా వచ్చిపోయే కష్టసుఖాల నడుమ మాకు బతికే స్వేచ్ఛనివ్వు.. మానవ సమాజంలోనే బతుకుతూ మృగాలుగా జీవిస్తున్న వారిలో మార్పు తెచ్చి మానవతను చాటనివ్వు.. చట్టాలు చేతిలో ఉన్నా.. ఉరితాళ్లు మెడలో వేసుకుంటున్న నారీమణులకు ఎదురించే ధైర్యాన్నివ్వు.. మనోధైర్యం కోల్పోయి చిన్నచిన్న విషయాలకే మరణంతో దోస్తీ చేస్తున్న యువకులకు ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించు.. కళ్ల ముందే అన్నీ జరుగుతున్నా వేడుక చూస్తున్న పాలకులకు ప్రజల సమస్యలు తీర్చే ఆలోచన కలుగనివ్వు.. రామయ్యా.. చివరకు చెప్పేదొక్కటేనయ్యా నీ మోములా స్వచ్ఛమైన రూపంతో.. నీవు నవ్వే అందమైన నవ్వుతో.. నీ పాలన వల్లే అందరినీ ఆనందపరిచే తరుణం రావాలని దీవించు.. జై శ్రీరాం.

దోచుకోవడం.. దాచుకోవడం

ఒకనాడు ప్రజాహిత పరిపాలన ద్వారా నీవు చాటిన ఆదర్శం ఇప్పటి నేతల్లో లేదు. నాడు పరిపాలన కోసం నీవు చూపిన తెగువ ఇప్పటి పాలకులకు లేదు. నీతికి నిదర్శనంగా నీ పాలనను చెప్పుకొంటుంటే.. అవినీతికి నిలయంగా మారి నేటి నాయకుల నడవడిక సాగుతోంది. తామేమీ తక్కువ కాదంటూ అధికారులు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ.. ప్రజల సొమ్మును దోచుకుంటూ దాచుకుంటున్నారు. నాడు నువ్వు కడలికి వారిధి కట్టిస్తే.. ఇప్పుడు కాంట్రాక్టర్లు కట్టడాల్లో నాణ్యతను మింగేసి అవినీతికి పాల్పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులపై అవినీతి అక్రమాలపై ప్రభుత్వం వరకు ఫిర్యాదులు వెళ్లాయి.

వినుడు వినుడు మా గాథ..

ఆ కాలంలో నీ ఆదర్శాలు ఎన్నన్ని చెప్పేది. ఏమని వర్ణించేది. పితృవాక్య పరిపాలనే ధ్యేయంగా అడవుల పాలయ్యావు నువ్వు.. కనిపెంచిన తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు తరలిస్తున్నారు నేటి కొడుకులు. తమ్ముడికి రాజ్యపాలన అప్పగించావు నువ్వు.. ఆస్తికోసం ఒకరినొకరు చంపుకుంటున్నారు నేటి అన్నదమ్ములు. పిన్ని మాట కోసం రాజ్యాన్ని వదిలేశావు నువ్వు.. కన్నతల్లిని సైతం పొట్టన పెట్టుకుంటున్నారు నేటితరం యువకులు. భార్యాభర్తల అనురాగాన్ని చాటావు.. భార్య నిప్పు అని నిరూపించావు.. కానీ నేడు అనుమానంతో భార్యల గొంతులు కోస్తున్నారు భర్తలు. నమ్మిన వారి కోసం నువ్వు చేసింది వనవాసం.. నమ్మడం లేదా రామా.. ఇటు చూడు.

◆ తాగుడుకు డబ్బు ఇవ్వలేదనే నెపంతో కన్నతల్లినే హతమార్చేందుకు ప్రయత్నించాడు.

◆ ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యకు యత్నించారు.

◆ ప్రేమ విఫలమైందని ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

◆ భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది.

◆ ప్రేమించి పెళ్లాడిన వ్యక్తే జీవిత భాగస్వామిని కడతేర్చిన ఘటన చోటు చేసుకుంది. (ఇవీ ఏడాది కాలంలో జరిగిన కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ఇంకా అనేకం ఉన్నాయి.)